సాక్షి
మెదక్
శనివారం । 23 । మార్చి । 2024



న్యూస్‌రీల్

మరోసారి మోదీయే ప్రధాని



మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

అల్లాదుర్గం(మెదక్): మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. శుక్రవారం అల్లాదుర్గంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ హయాంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. 400 సీట్లతో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు రాములు, నందంగౌడ్, సాయిలుగౌడ్, బాలరాజ్, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు వినియోగించుకోవాలి



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్

మెదక్: అర్హులు ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్వీప్ ఓటరు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాబోయే లోకసభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫారం–6 నింపి సంబంధిత బూత్‌స్థాయి అధికారికి అందజేయాలని సూచించారు. అలాగే ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా సైతం నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పీడీ మెప్మా ఇందిరా బూత్‌స్థాయి అధికారులు, ఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధ తల్లిదండ్రులను విస్మరించొద్దు



ఇంటి తాళం చెవిని వృద్ధ దంపతులకు అప్పగిస్తున్న జడ్జి అనిత

నర్సాపూర్: వృద్ధ తల్లిదండ్రుల ఆలనా పాలన కొడుకులు, కూతుర్లు చూసుకోవాలని, లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తప్పవని జూనియర్ సివిల్ జడ్జి అనిత హెచ్చరించారు. శుక్రవారం ఓ వృద్ధ దంపతుల గోడును విన్న జడ్జి వెంటనే స్పందించి వారికి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. కొడిపల్లి మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన గండి లచ్చయ్య, తులసమ్మ దంపతులు మండల లీగల్ సర్వీస్ కమిటీని ఆశ్రయించారు. తాము సంపాదించిన స్థిర, చరాస్తులను తమ కుమారుడు మధుసూదన్‌గౌడ్ మోసపూరితంగా అతడి పేరు మీదకు మార్చుకున్నాడని వాపోయారు. ఇంట్లో సైతం ఉండనివ్వనందున తాము రోడ్డున పడ్డామని.. న్యాయం చేయాలని వేడుకున్నారు. జడ్జి స్పందించి ఇంటి తాళం చెవిని తెప్పించి వృద్ధ దంపతులకు అప్పగించారు. తల్లిదండ్రులను పట్టించుకోకుంటే వారి నుంచి పొందిన ఆస్తులను కుమారులు, కూతుర్ల నుంచి జప్తు చేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, మధుశ్రీ, స్వరూపరాణి, కోర్టు సూపరింటెండెంట్ పద్మావతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ములుగు(గజ్వేల్): అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం(ఎఫ్‌సీఆర్ఐ) డీన్‌గా ఐఎఫ్ఎస్ అధికారి ఎస్.జె.ఆశ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా కళాశాల అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యతాయుత విద్య, ఫారెస్ట్రీ కోర్సులపై ఆసక్తి పెంచడం, పరిశోధనల్లో నాణ్యత పెంపు లక్ష్యంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

మదింపు.. బరితెగింపు!

ఆస్తి పన్ను మదింపు విషయంలో అక్రమాలు
700పైగా ఖాళీ ప్లాట్లకు ఇంటి నంబర్లు
రామాయంపేట మున్సిపాలిటీలో నిర్వాకం

రామాయంపేట మున్సిపాలిటీలో మరో అవినీతికి తెరలేచింది. ఆస్తిపన్ను మదింపు విషయంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఏకంగా ఏడు వందలకు పైగా ఖాళీ ప్లాట్లకు నిబంధనలకు విరుద్ధంగా నంబర్లు కేటాయించి ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. మరోవైపు రాజకీయంగా, ఆర్థికంగా పలుకుబడి ఉన్నవారికి వందల్లో బిల్లులు వేసి నిరుపేదల నుంచి వేలల్లో పన్ను వసూలు చేస్తున్నారు.

– రామాయంపేట(మెదక్)



ఈ ప్లాట్లకే ఇంటి నంబర్లు కేటాయించింది



రామాయంపేట మున్సిపల్ కార్యాలయం

నిరుపేదలకు వేలల్లో ఇంటి పన్ను

రామాయంపేట మున్సిపల్ సిబ్బంది బెదిరింపులకు దిగుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వేలల్లో ఇంటి పన్ను వేసి నిర్బంధంగా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. పన్ను చెల్లించకపోతే ఇంటి తలుపులు ఎత్తుకెళ్తామని, కరెంట్, నల్లా కనెక్షన్లు తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామాయంపేట మేజర్ పంచాయతీగా కొనసాగినప్పుడే ఖాళీ స్థలాలకు నంబర్లు కేటాయించారని, అదే కొనసాగుతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. నివాస గృహాలు లేకపోయినా ఉన్నట్లు ఇంటి నంబర్లు కేటాయించడం తీవ్ర తప్పిదమని ఆశాఖ అధికారులు అంగీకరించారు. భువన్ సర్వేలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని నివాస, వ్యాపార, వాణిజ్య భవన సముదాయాల కొలతలు తీసి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. సరిగ్గా ఇదే సమయంలో అవినీతికి తెర లేచింది. ఖాళీ స్థలాల్లో కొలతలు తీసి నివాస భవనాలు ఉన్నట్లు నమోదు చేసి పన్నులు వేశారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఖాళీ స్థలాలకు నంబర్లు కేటాయించవద్దని, వాటిని ఇంటి పన్ను జాబితా నుంచి తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా ఎంతమాత్రం పట్టించుకోలేదు.

పారదర్శకత లోపించింది: ఎమ్మెల్యే రోహిత్

ఇంటి పన్ను వసూళ్ల విషయంలో పారదర్శకత లోపించిందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ వ్యాఖ్యానించారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న వారికి తక్కువ మొత్తంలో, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఎక్కువ మొత్తంలో బిల్లులు వేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈవిషయమై కమిషనర్ స్పందించి సరిదిద్దాలని సూచించారు.

అప్పు చేసి చెల్లించా



గతంలో తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా 50 గజాల్లో నిర్మించుకున్నా. తన ఇంటికి ఏకంగా రూ. పదివేల ఇంటి పన్ను వేశారు. బకాయిలు చెల్లించకపోతే ఇంటి తలుపులు ఎత్తుకెళ్తామని మున్సిపల్ సిబ్బంది బెదిరింపులకు దిగారు. విధిలేని పరిస్థితుల్లో అప్పు చేసి ఇంటి పన్ను చెల్లించా. – ఎర్ర రెడ్డయ్య, ఎస్సీ కాలనీ

రివైజ్ చేస్తాం



రామాయంపేట మేజర్ పంచాయతీగా కొనసాగుతున్నప్పుడే ఖాళీ ప్లాట్లకు నంబర్లు కేటాయించి ఇంటి పన్ను వసూలు చేశారు. మున్సిపాలిటీ రూపాంతరం చెందిన తర్వాత ఈ ప్రక్రియ ఆన్‌లైన్‌లో అలాగే కొనసాగుతుంది. తొలగించే వీలు లేకుండా పోయింది. పలుకుబడి ఉన్నవారికి వందల్లో పన్నులు, నిరుపేదలకు వేలల్లో ఇంటి పన్నులు వచ్చిన విషయంలో రివైజ్ చేస్తాం.

– దేవేందర్, కమిషనర్, రామాయంపేట మున్సిపాలిటీ



నీటి బొట్టు.. ఒడిసి పట్టు

నీటిని సంరక్షించడంతో పాటు ఒడిసిపట్టుకోవాలనే సందేశం ఇచ్చేలా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని గీతా స్కూల్ విద్యార్థులు వినూత్న ప్రదర్శన చేపట్టారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. నీటిని పొదుపు చేస్తే అంతా సుభిక్షంగా ఉంటుందని తెలియజేస్తూ భారత మాతను జలంతో అభిషేకం చేస్తున్నట్లు ప్రదర్శించారు.

– మనోహరాబాద్(తూప్రాన్)

వన్యప్రాణులకు రక్షణ కల్పించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

సాక్షి స్పందన



వనవిజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

హవేళిఘణాపూర్(మెదక్): వేసవిలో వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'మూగవేదన' కథనానికి స్పందించి పోచారం అభయారణ్యంను సందర్శించారు. వన్యప్రాణులకు ఏర్పాటు చేసిన తాగు నీటి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న వనవిజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. సఫారీ వాహనంలో 4.5 కిలో మీటర్ల మేర అటవీలో ప్రయాణించి జింకల ప్రత్యుత్పత్తి కేంద్రాన్ని చూశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల జంతువులకు ఆహారం, తాగునీరు అందించాలని సూచించారు. వనవిజ్ఞాన కేంద్రం ఏర్పాటు, అటవీ విస్తీర్ణం, సందర్శకుల సమయపాలన గురించి అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మెదక్ ఆర్డీఓ రమాదేవి, హవేళిఘణాపూర్ తహసీల్దార్ నారాయణ, అటవీ సెక్షన్ అధికారి శ్రావణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ ప్రసాద్‌గౌడ్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ సారెవరు..?

- అజ్ఞాతంలో మెదక్ రూరల్ ఎస్ఐ అమర్



హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల లంచం తీసుకుంటూ కానిస్టేబుల్ సురేందర్ (రైటర్) ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. అయితే మొదటగా ఇసుక ట్రాక్టర్ యజమాని నుంచి రూ. 20 వేలకు ఒప్పందం కుదుర్చుకోగా, అతడు రూ.15 వేలు చెల్లించాడు. ఆ చెల్లించిన డబ్బులను 'సార్‌కు ఇచ్చాను' మిగితా రూ. 5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈక్రమంలో రూ. 4 వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారుల వలలో చిక్కాడు. అయితే ఈ కేసులో సార్‌కు ఇచ్చిన అని చెప్పడంతో ఆ సార్ ఎవరూ..? అనే దానిపై ఏసీబీ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఏసీబీ దాడి జరిగిన రోజు నుంచి నేటి వరకు మెదక్ రూరల్ ఎస్ఐ అమర్ అజ్ఞాతంలోకి వెళ్లడంతో అనుమానాలకు మరింత బలం చేకూరుతోంది. కిందిస్థాయి అధికారులకు ఎంత అత్యవసరం ఉన్న ఉన్నతాధికారులకు సమాచారం అందించి సెలవు తీసుకోవడం తప్పనిసరి. కానీ ఎస్ఐ హోదాలో సీఐ, డీఎస్పీలకు కనీస సమాచారం ఇవ్వకుండా అజ్ఞాతంలోకి వెళ్లడం వెనుక అసలు ఏం అయి ఉండొచ్చని చర్చించుకుంటున్నారు. ఇదే విషయమై మెదక్ రూరల్ సీఐ కేశవులును వివరణ కోరగా ఎస్ఐ విధులకు గైర్హాజరుపై కావడంపై తమకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు.

2,500 ఎకరాల్లో పంట నష్టం

- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



వివరాలు వెల్లడిస్తున్న గోవింద్

మెదక్ కలెక్టరేట్: ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాలతో సుమారు 2,500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ ఎల్లయ్య ఆధ్వర్యంలో వ్యవసాయం, స్త్రీ, శిశు, సాంఘిక సంక్షేమంపై స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. జిల్లాలో 2,28,379 మంది రైతులకు రుణ మాఫీ వచ్చిందని, రూ.115.25 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. పంటనష్టంపై ప్రభుత్వం ఇప్పటివరకు జీఓ జారీ చేయనందున నష్ట పరిహారం వివరాలు తెలియరాలేదన్నారు. అనంతరం డీడబ్ల్యూఏఓ బ్రహ్మాజీ మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలో 5 బాల్య వివాహాలను అడ్డుకొని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన నలుగురు అనాథ పిల్లలను గుర్తించి వారికి ప్రతి నెల రూ. 4 వేల ఆర్థికసాయం అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఎస్సీ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ.. జిల్లాలో కులాంతర వివాహాలను ప్రోత్సాహిస్తూ ప్రభుత్వం ఒక్కో జంటకు రూ. 2.50 లక్షలు అందజేస్తుందన్నారు. ఇందుకోసం ఇప్పటివరకు 63 జంటలు దరఖాస్తు చేసుకోగా 8 జంటలకు డబ్బులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ అధికారి శంకర్‌నాయక్, మైనార్టీ సంక్షేమ అధికారి జెమ్లా నాయక్ తమతమ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధిపై వివరించారు. కార్యక్రమంలో కొల్చారం జెడ్పీటీసీ మేఘమాల, టేక్మాల్ కో ఆప్షన్ మెంబర్ యూసుఫ్, వెల్దుర్తి కో ఆప్షన్ మెంబర్ మన్సూర్ హైమద్, కొడిపల్లి జెడ్పీటీసీ కవిత, టేక్మాల్ జెడ్పీటీసీ సరోజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- మల్టీజోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్
- సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచన



మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్, పక్కన ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని మల్టీజోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి, పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. అధికారులు సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ, సహాయ సహకారాలు అందించుకోవాలని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. గడిచిన ఎన్నికల్లో జిల్లా నలుమూలల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం, డబ్బు రవాణా కాకుండా నియంత్రించినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో సైతం వాహనాల తనిఖీ పెంచాలని, సరైన ధ్రువపత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. గంజాయి, పీడీఎస్ రైస్ అక్రమ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అక్రమ డబ్బు, మద్యం, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు రాజేశ్వర్, వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, ఏఆర్ డీఎస్పీ రంగనాయక్‌తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శనిత్రయోదశికి ముస్తాబు



వర్గల్(గజ్వేల్): విద్యాసరస్వతీ క్షేత్రంలోని శనీశ్వరాలయం శనివారం శనిత్రయోదశి మహోత్సవానికి ముస్తాబైంది. తైలాభిషేకం జరిపితే శనిదోషం తొలగిపోతుందని భక్తుల విశ్వాసం. వేకువజాము నుంచే తిలా, తైలాభిషేకాలు జరిపించేందుకు భక్తులు పోటెత్తనున్నారు. అందకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటలకు గణపతి పూజ, శనీశ్వర మూల మంత్ర జపం, తర్పణం, హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రూ.250 చెల్లించి భక్తులు సామూహిక తైలాభిషేకంలో పాల్గొనవచ్చు. అవసరమైన పూజా సామగ్రి, పూజా ద్రవ్యములను ఆలయంలో ఉచితంగా అందజేస్తారు.

పకడ్బందీగా ఎన్నికలు

'సాక్షి'తో నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి



నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న చర్యలను వివరించారు.

నియోజకవర్గంలో 2,26,193 ఓటర్లు

నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 2,26,193 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వారి కోసం 307 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 70 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు గుర్తించామని, వాటిలో అదనపు బలగాలతో బందోబస్తుతో పాటు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసి పోలింగ్ సరళిని పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అవసరం ఉన్న చోట సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేస్తామని వివరించారు. కాగా 85 సంవత్సరాలు నిండిన ఓటర్లు కోరితే వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో మూడు చెక్ పోస్టులు.. మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ల ప్రారంభం నాటికి 10 రోజుల ముందు వరకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఒక చోట ఓటు కలిగిన వ్యక్తులు అక్కడ కాకుండా మరో చోట ఓటు పొందాలనుకుంటే బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాలని హితవు పలికారు. ఆయా రాజకీయ పార్టీల నాయకులు, పోటీలో ఉన్న వ్యక్తులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని భావిస్తే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అభ్యర్థులు సువిధ ద్వారా సభలు, ప్రచారానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఉత్కంఠకు తెర

- మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి
- అనూహ్యంగా తెరపైకి వచ్చిన పేరు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మెదక్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థిత్వంపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. అనూహ్యంగా ఎమ్మెల్సీ, మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డిని అభ్యర్థిగా ప్రకటిస్తూ ఆ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ అభ్యర్థిత్వం ఎంపిక విషయంలో శుక్రవారం కేసీఆర్ తన వ్యవసాయక్షేత్రంలో పార్టీకి చెందిన జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితర నాయకులతో సుదీర్ఘంగా చర్చలు జరిపిన అనంతరం కేసీఆర్ ఈ మేరకు వెంకట్రాంరెడ్డికి మెదక్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఇప్పటికే ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేరు ఖరారైన విషయం విధితమే. కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఇంకా ఖరారు కావాల్సి ఉంది.

మారిన నిర్ణయం వెనుక..

మెదక్ ఎంపీ టికెట్‌కు ముందుగా గజ్వేల్‌కు చెందిన మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి దాదాపు ఖరారైందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన నియోజకవర్గంలో ఎన్నికల పనిలో కూడా నిమగ్నమయ్యారు. పార్లమెంట్ స్థానం పరిధిలోని పటాన్‌చెరు తదితర అసెంబ్లీ స్థానాల్లో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో కూడా వంటేరు పాల్గొన్నారు. ఆయనతో పాటు ఈ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్య యాదవ్ తదితరులు ఆశించారు. అయినప్పటికీ వంటేరు ప్రతాప్‌రెడ్డికి దాదాపు ఖాయమైందని గులాబీ పార్టీ వర్గాలు భావించాయి. అధికారికంగా ప్రకటించకపోవడంతో ఈ స్థానం నుంచి స్వయంగా అధినేత కేసీఆరే బరిలోకి దిగుతారనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో అనూహ్యంగా వెంకట్రాంరెడ్డికి ఈ టికెట్ ఖరారు చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

సిద్దిపేట మాజీ కలెక్టర్‌గా..

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తికి చెందిన వెంకట్రాంరెడ్డికి ఉమ్మడి మెదక్ జిల్లాలో సన్నిహిత సంబంధాలున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సిద్దిపేట కలెక్టర్‌గా ఆయన సుమారు ఐదేళ్ల పాటు పని చేశారు. అంతకు ముందు ఉమ్మడి మెదక్ జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. జాయింట్ కలెక్టర్‌గా, అదనపు కలెక్టర్‌గా 2014 నుంచి 2017 వరకు పనిచేశారు. మధ్యలో కొన్ని రోజులు మెదక్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా కూడా బాధ్యతల్లో కొనసాగారు. 2021లో కలెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన వెంకట్రాంరెడ్డికి కేసీఆర్ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. కేసీఆర్‌తో సన్నిహిత సంబంధాలున్న వెంకట్‌రాంరెడ్డికి అనూహ్యంగా మెదక్ అభ్యర్థిత్వం దక్కడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆర్థికంగా బలమైన నేత

కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, ఉన్నతాధికారిగా ఉమ్మడి మెదక్ జిల్లాతో సంబంధం ఉన్న వెంకట్రాంరెడ్డికి రాజకీయంగా పెద్దగా సంబంధాలు లేవు. 2021 నవంబర్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనప్పటికీ.. ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లో పెద్దగా పాల్గొన్న దాఖలాలు లేవు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకటీ రెండు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా అధినేత నియమించినప్పటికీ.. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న దాఖలాలు తక్కువ. కానీ ఆర్థికంగా బలమైన నేతగా పేరుంది. ఈ నేపథ్యంలో ఆయనను అభ్యర్థిగా ప్రకటించడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసాచార్యులు



గజ్వేల్‌రూరల్‌: తెలంగాణ ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఉపాధ్యక్షుడిగా శేషం శ్రీనివాసాచార్యులు నియామకమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌ కార్యాలయంలో గురువారం తెలంగాణ ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం, తెలుగు నూతన (క్రోధినామ) సంవత్సర పంచాంగ ఆవిష్కరణ నిర్వహించారు. నూతనంగా ఎన్నుకోబడిన రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్‌ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నుంచి గజ్వేల్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు శేషం శ్రీనివాసాచార్యులను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో శేషం శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ తెలంగాణ ధూపదీప నైవేద్య అర్చక సంఘం సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన కార్యాచరణను రూపొందించడం జరిగిందని, ప్రభుత్వం తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ కోట నీలిమ, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి సుధాకర్‌, వైష్ణవ సంఘం అధికార ప్రతినిధి వేదాంతం పవన్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

డీసీఎంఎస్‌ మహాజన సభ



మాట్లాడుతున్న శివకుమార్‌

సంగారెడ్డి : పట్టణంలోని పాత కలెక్టరేట్‌ కాంప్లెక్స్‌లో ఉమ్మడి మెదక్‌ జిల్లా డీసీఎంఎస్‌ మహాజన సభ మల్కాపురం శివకుమార్‌ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశం అజెండా అంశాల తీర్మానాలు, తీసుకున్న చర్యలు మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సభ్యులు డీసీఎంఎస్‌ వ్యాపార అభివృద్ధికి సలహాలు, సూచనలు చేశారు . సమావేశానికి ఉమ్మడి మెదక్‌ జిల్లాలోని సహకార సంఘాల అధ్యక్షులు, డీసీసీబీ అధ్యక్షుడు చిట్టి దేవేందర్‌ రెడ్డి, డీసీఎంఎస్‌ ఉపాధ్యక్షుడు అరిగె రమేశ్‌ కుమార్‌, మార్క్‌ఫెడ్‌ డైరెక్టర్‌ జగన్మోహన్‌ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్‌ అనంతరెడ్డి, డీసీఎంఎస్‌, డీసీసీబీ డైరెక్టర్లు, డీసీఎంఎస్‌ బిజినెస్‌ మేనేజర్‌ ఆంజనేయులు పాల్గొన్నారు.

పెండింగ్‌ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న వేణు

చేర్యాల(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలను విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్‌ రాష్ట్ర కార్యదర్శి పుల్లని వేణు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వేణు మాట్లాడారు. ప్రభుత్వం మారినా విద్యార్థుల జీవితాలు మారలేదన్నారు. స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు కోట్ల రూపాయలు పెండింగ్‌లో పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సరికాదన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు హరికృష్ణ, ఉపాధ్యక్షుడు అఖిల్‌, నాయకులు తిరుపతి ఉన్నారు.

మొక్కవోని సాగు

జిల్లాలో విస్తారంగా మొక్కజొన్న

- 20 వేల ఎకరాల విస్తీర్ణంలో పంట
- నీటి వనరులు ఉండడంతో రైతులు ఆసక్తి
- ఆలుగడ్డ, పత్తి పంటలు తీశాక రెండో పంటగా ప్రాధాన్యత
- మార్కెట్‌లోనూ మంచి గిట్టుబాటు ధర

జిల్లాలో మొక్కజొన్న పంట విస్తారంగా సాగైంది. తగినంత మేర నీటి వనరులు ఉండడంతో పాటు మార్కెట్‌ మంచి ధర పలుకుతుంది. దీంతో రైతులు పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20వేల ఎకరాల్లో పంట సాగైనట్లు ఇటు వ్యవసాయ శాఖ, అటు రైతాంగం అంచనా వేస్తోంది. సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఆశించిన అధిక దిగుబడులు పొందవచ్చని సూచిస్తున్నారు. **– జహీరాబాద్‌**



జహీరాబాద్‌ ప్రాంతంలోనే మూడున్నర వేల ఎకరాల్లో పంట సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అనధికారికంగా మాత్రం సుమారు 5 వేల ఎకరాల్లో పంట సాగైనట్లు తెలుస్తోంది. ఈ ఏడాది అధికంగా వర్షాలు కురియడంతో భూగర్భ జలాల మట్టం రికార్డు స్థాయిలో పెరిగింది. దీంతో రైతులు మొక్కజొన్న పంట సాగుపై ఆసక్తి చూపారు. ఫలితంగా పంట సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది.

గతంలో 5 వేల ఎకరాల లోపే..

గతంలో యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో కూడా సాగులో ఉండేది కాదు. గతేడాది నుంచే రైతులు యాసంగిలో మొక్కజొన్న పంట సాగుపై మొగ్గు చూపుతుండడంతో పంట విస్తారంగా సాగులోకి వచ్చింది. వ్యవసాయ బావులు, బోర్లలో తగినంత నీరు ఉండడం, మొక్కజొన్న పంటకు మార్కెట్లో మంచి ధర పలుకుతుండడంతో పంట సాగు విస్తీర్ణం పెరిగేందుకు కారణమైందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. యాసంగిలో పంట దిగుబడులు పెరగడంతోపాటు పెట్టుబడులు అంతంత మాత్రమే అవసరం ఉంటుందనే ఉద్దేశ్యంతో రైతులు మొక్కజొన్న పంట సాగుకు మొగ్గు చూపారు.



జహీరాబాద్‌ ప్రాంతంలో సాగు చేసిన మొక్కజొన్న పంట

పత్తి, ఆలుగడ్డ తీశాక సాగు

వానాకాలంలో వేసుకున్న పత్తి పంట, అక్టోబర్‌, నవంబర్‌ మాసాల్లో వేసుకున్న ఆలుగడ్డ పంటలు చేతికి అందివచ్చాక మొక్కజొన్న పంటను వేసుకుంటున్నారు. పత్తి వేసుకున్న వారు రెండో పంటగా, సోయాబీన్‌ వేసుకున్న వారు ఆలుగడ్డ రెండో పంటగా వేసుకున్న అనంతరం మూడో పంటగా మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. పత్తి పంటలు దెబ్బతినడంతో చివరి కాత కోసం ఎదురు చూడకుండా తొలగించి మొక్కజొన్న పంట వేసుకున్నారు. దీంతో రికార్డు స్థాయిలో పంట సాగైనట్లు అంచనా వేస్తున్నారు. వర్షాకాలం పంటలు పూర్తిగా దెబ్బతిన్న స్థానంలో శనగ పంటకు బదులుగా మొక్కజొన్నపై ఆసక్తి చూపారు. శనగ పంటకు తగిన ధర లేకపోవడం, పంట దిగుబడి సైతం అంతంత మాత్రమే వస్తుందనే ఉద్దేశ్యంతో మొక్కజొన్న పంటను సాగు చేశారు.

క్వింటాల్‌కు రూ.2,200



మొక్కజొన్నకు మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో సాగు చేశాను. క్వింటాల్‌ ధర సగటున రూ.2,200 పలుకుతోంది. నీటి వనరులు పుష్కలంగా ఉన్నందున ఆసక్తి చూపాను. మొక్కజొన్న పంటకు తెగుళ్ల బెడద ఉండదు, పంట కూడా నమ్మకంగా వస్తుందనే ఉద్దేశ్యంతో సాగు చేశా. నీటి తడులు ఎక్కువ తక్కువ అయినా ఓర్చు కుంటుంది. పంట చేతికి వచ్చాక కోతకు యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది.

– కృష్ణకాంత్‌, రైతు,రంజోల్‌ గ్రామం

నీటి సాకర్యం ఉంది



జహీరాబాద్‌ ప్రాంతంలో మొక్కజొన్న పంట విస్తారంగా సాగయ్యింది. వ్యవసాయ బావులు, బోర్లలో నీరు పుష్కలంగా ఉండడంతో యాసంగిలో రైతులు పంట సాగుపై మొగ్గు చూపారు. కొందరు రైతులు పత్తి, ఆలుగడ్డ పంటలను తీసిన తర్వాత మొక్కజొన్న వేసుకున్నారు. ఇతర పంటలకంటే మొక్కజొన్న పంట దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయనే ఉద్దేశ్యంతో రైతులు ఆసక్తి చూపారు.

– వెంకటేశం, ఇన్‌చార్జి ఏడీఏ, జహీరాబాద్‌



నర్సాపూర్‌ రూరల్‌: పోస్టర్‌ ప్రదర్శిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

నీటిని పొదుపుగా వాడుకోవాలి

నర్సాపూర్‌ రూరల్‌: నీటిని పొదుపుగా వాడుకోవాలని బీవీఆర్‌ఐటీ సివిల్‌ ఇంజినీర్‌ హెచ్‌ఓడీ డాక్టర్‌ కృష్ణారావు అన్నారు. శుక్రవారం వరల్డ్‌ వాటర్‌ డే సందర్భంగా మండలంలోని రామచంద్రాపూర్‌లో నీటి పొదుపు, చెట్ల సంరక్షణ పై కళాశాల విద్యార్థులు, సిబ్బంది గ్రామస్తులకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా అవసరాలతోపాటు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలంటే మొక్కలు విరివిగా పెంచి వాటిని కాపాడాలని సూచించారు. విద్యార్థులకు క్విజ్‌, పోస్టర్‌ ప్రజెంటేషన్‌, సెమినార్‌, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సివిల్‌ ఇంజినీర్‌ సిబ్బంది డాక్టర్‌ విజయ గౌరీ, రూప దేవి, అభయ్‌, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విద్యార్థులు, సిబ్బందిని కళాశాల డైరెక్టర్‌ లక్ష్మీప్రసాద్‌, ప్రిన్సిపాల్‌ సంజయ్‌ దూబే, మేనేజర్‌ బాపిరాజు అభినందించారు.

ప్రాణకోటి మనుగడకు నీరే ఆధారం

సంగారెడ్డి అర్బన్‌: భూమిపై జీవరాశి మనుగడకు ప్రధాన ఆధారం నీరేనని, నీరు లేనిదే ఈ భూమిపై జీవము లేదని, భావితరాల భవిష్యత్‌ కోసం ప్రతీ నీటి చుక్కను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తారా కళాశాల ప్రిన్సిపాల్‌ రత్నప్రసాద్‌ అన్నారు. శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్లు, వృక్ష శాస్త్ర ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. నీటిని వృథా చేయకుండా, కాలుష్యం కాకుండా, జాగ్రత్తగా వాడడమే కాక వర్షపు నీటిని సంరక్షిస్తూ, నీటి సంరక్షణ విధానాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని అప్పుడే ఈ భూమిపై జీవరాశికి, వృక్ష సంపదకి మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్స్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ అధికారులు డాక్టర్‌ పద్మజ, డాక్టర్‌ సిద్ధులు, డాక్టర్‌ అభిజిత్‌, డాక్టర్‌ వెంకటేశం, డాక్టర్‌ జగదీశ్వర్‌, శివదీప్తి పాల్గొన్నారు.

తీరు మారకపోతే తడాఖా చూపిస్తా

- ఆకతాయిలకు అదనపు ఎస్పీ మహేందర్‌ హెచ్చరిక
- బాలికలు, మహిళల రక్షణకు షీ టీమ్స్‌



ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్‌ ఇస్తున్న మహేందర్‌

మెదక్‌ మున్సిపాలిటీ: ఆకతాయిలు తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని అదనపు ఎస్పీ అడ్మిన్‌ మహేందర్‌ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఇటీవల పట్టుబడిన ఆకతాయిలకు ఆన్‌లైన్‌ ద్వారా కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఈవ్‌ టీజింగ్‌, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, వాటి పర్యవసానాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అడ్మిన్‌ మహేందర్‌ మాట్లాడుతూ.. ఆకతాయి పనులు చేసి తమ బంగారు భవిష్యత్‌ను కన్న తల్లిదండ్రుల ఆశలను నాశనం చేయొద్దని హెచ్చరించారు. ఆలోచనలను చదువు మీద సారించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఆకతాయిల వల్ల మహిళలకు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 87126 57963 నంబర్‌కు ఫోన్‌ చేసి కానీ, వాట్సాప్‌ ద్వారా మెసేజ్‌ చేసి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఫిర్యాదును అందుకున్న వెంటనే షీ టీమ్స్‌ బాధిత మహిళలకు అండగా నిలుస్తారని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఉపాధి హామీలో 'కంగ్టి' ఫస్ట్‌



కూలీలతో మాట్లాడుతున్న బాలరాజు

అదనపు డీఆర్‌డీఓ బాలరాజు

కంగ్టి(నారాయణఖేడ్‌): జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో జిల్లాలోనే కంగ్టి మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జీ. బాలరాజు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్తయ్యతో పాటు సిబ్బందిని అభినందించారు. శుక్రవారం మండల కేంద్రం కంగ్టికి చెందిన పెద్ద చెరువు వద్ద ఉపాధి పనులను పరిశీలించారు. దాదాపు 300 మంది కూలీలు పనులు చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధి పనులు ప్రతీ కుటుంబానికి 100 రోజులు నిర్వహించేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ ఒక్కరికి రూ. 270 కూలి వచ్చేట్లు చూడాలని టెక్నికల్‌ అసిస్టెంట్‌కు జిల్లా ప్లాంటేషన్‌ ఆఫీసర్‌ నాగేశ్వర్‌రావు ఆదేశించారు. ఉపాధి, నర్సరీల నిర్వహణపై ఉపాధి ఎంపీడీఓతో రివ్యూ మీటింగ్‌ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ రాజు, జిల్లా ప్లాంటేషన్‌ ఆఫీసర్‌ మణికుమార్‌, ఏపీఓ, జూనియర్‌ అసిస్టెంట్‌, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్‌ ఆఫీసర్లు, మేట్లు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంచుకోండి

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పీవీ ఉమాశశి



మాక్‌ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్‌: విద్యార్థినులు చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గజ్వేల్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పీవీ ఉమాశశి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులు మాక్‌ అసెంబ్లీని నిర్వహించారు. కార్యక్రమంలో స్పీకర్‌గా సంధ్య, ముఖ్యమంత్రి గా మమత, ఉప ముఖ్యమంత్రిగా రేణుక, మంత్రులుగా పూజిత, అనూష, దీక్షిత, మానస, గాయత్రీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ పాత్రను చందన, కేటీఆర్‌ పాత్రను కార్తీక, అక్బరుద్దీన్‌ ఓవైసీగా శబ్నం, హరీశ్‌రావుగా లయ, ప్రతిపక్ష నేతలుగా భవాని, నిఖిత, శిరీషలు వ్యవహరించారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష పార్టీ శాసనసభ్యులుగా వ్యవహరిస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ ఉమాశశి మాట్లాడుతూ.. విద్యార్థినులు సమాజంలో జరిగే అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. మాక్‌ అసెంబ్లీలో విద్యార్థుల పాత్ర అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఉమారాణి, అధ్యాపకులు డాక్టర్‌ అనిత, డాక్టర్‌ జయరాజు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ మండలం తోటపల్లి వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఎంవీఐ కొండల్‌ రావు శుక్రవారం కిషన్‌నగర్‌ వద్ద పట్టుకొని సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక గూడ్స్‌ వాహనం సీజ్‌ చేశామని, వాటికి సరైన పత్రాలు లేవని పేర్కొన్నారు. సీజ్‌ చేసిన వాహనాలను ఆర్టీసీ డిపోకు తరలించినట్లు తెలిపారు.

రెండు ట్రాక్టర్లు

పాపన్నపేట(మెదక్‌): అనుమతులు లేకుండా చెరువులో నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేశ్‌ తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ మాట్లాడుతూ.. గురువారం రాత్రి మండల పరిధిలోని అబ్లాపూర్‌ గ్రామ చెరువులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారంతో సిబ్బందితో కలిసి వెళ్లి కొత్తపల్లి శివారులో ట్రాక్టర్లను పట్టుకొని సీజ్‌ చేశామన్నారు. గ్రామానికి చెందిన రాజబోయిన దుర్గేష్‌, శెగ్గరి రాజుగౌడ్‌లపై కేసు నమోదు చేశామన్నారు.



ఉసురు తీసిన కుటుంబ కలహాలు

- ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



రాములు(ఫైల్‌)

కొల్చారం(నర్సాపూర్‌): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని అంసాన్‌పల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ గౌస్‌ కథనం మేరకు.. సంగముల రాములు (52)కు కుమారుడు మహేశ్‌ ఉన్నాడు. అదే గ్రామంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఇది నచ్చని తండ్రి మరో అమ్మాయితో వివాహం నిశ్చయించాడు. ఇది తెలిసిన అమ్మాయి వర్గపు వారు గురువారం రాములు ఇంటికొచ్చి తమ అమ్మాయికి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని గొడవ పడ్డారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాములు శుక్రవారం ఉదయం పాడి గేదెలను తీసుకొని వ్యవసాయ పొలానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా ఉరి వేసుకొని కనిపించాడు.

ఉజ్వల భవిష్యత్‌కు సాంకేతిక విద్య

- వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు
- పాలిటెక్నిక్‌ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు
- పదవ తరగతి ఉత్తీర్ణతతో అర్హత
- మే 24న పరీక్ష



పాలిటెక్నిక్‌ కళాశాలలో ప్రయోగం చేస్తున్న విద్యార్థులు (ఫైల్‌)

సంగారెడ్డి టౌన్‌: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పాలిటెక్నిక్‌ బాటు వేస్తుంది. పదవ తరగతి పూర్తి చేసుకోనున్న విద్యార్థులు సాంకేతిక విద్యాభ్యాసంలో అడుగు పెట్టి, ఉన్నతస్థాయి చేరుకోవడానికి పాలిటెక్నిక్‌ విద్య ఎంతో దోహదపడుతుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో త్వరగా ముందడుగు వేయడానికి.. జీవితంలో స్థిర పడటానికి పాలిటెక్నిక్‌ ఒక చక్కని ఉపాధిగా నిలవబోతోంది. ఈ విద్యా సంవత్సరానికి గాను పాలిసెట్‌ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఏప్రిల్‌ 24 వరకు తుది గడువు నిర్ణయించారు.

పదవ తరగతిలో ఉత్తీర్ణ సాధించిన వారు పాలిసెట్‌ చదవడానికి అర్హత సాధిస్తారు. ప్రస్తుతం పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. www.polycet.sbset.telangana.gov.in వెబ్‌సైట్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులు రూ.500 పరీక్ష ఫీజు చెల్లించాలి. గణితం, భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. నీటిపారుదల, ప్రజా వైద్యం, ఇంజినీరింగ్‌, రోడ్లు, భవనాలు, ఆర్టీసీ, విద్యుత్‌ సంస్థల్లో, వ్యవసాయం, అనుబంధ రంగాల్లోనూ పాలిటెక్నిక్‌ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. కార్పొరేట్‌ సంస్థలు, పరిశ్రమల్లోనూ ఉద్యోగాలు ఉంటాయి. పాలిటెక్నిక్‌ కోర్సు పూర్తి చేసి ప్రవేశ పరీక్ష ద్వారా బీటెక్‌ నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చు.

సీట్ల వివరాలు :

సంగారెడ్డి, జోగిపేట బాలికల, నారాయణఖేడ్‌ కళాశాలలు ఒక్కో దానిలో 120 సీట్ల చొప్పున ఉన్నాయి. రంజోల్‌లో 420, జోగిపేటలో 180 ఉన్నాయి. మెదక్‌ మహిళ, చేగుంట, గోమారం (నర్సాపూర్‌)లోని కళాశాలల్లో 120 సీట్ల చొప్పున ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలోని ఆరు కళాశాలల్లో 1,020 ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



పాలిసెట్‌ను గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. కోర్సులు పూర్తి చేసిన వారికి ఉజ్వల భవిష్యత్‌ ఉంటుంది. బీటెక్‌ కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉండటం ప్రత్యేకత. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు ప్రిన్సిపాల్‌, సంగారెడ్డి పాలిటెక్నిక్‌ కళాశాల

ఎండు గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీణారెడ్డి

నారాయణఖేడ్‌: టిఫిన్‌ సెంటర్‌పై ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు దాడి చేసి 600 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ వీణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండలం ర్యాలమడుగు తండా శివారులోని నిజాంపేట-ఖేడ్‌-బీదర్‌ జాతీయ రహదారి పక్కన భవానీ టిఫిన్‌ సెంటర్‌ లో గంజాయిని విక్రయిస్తున్నారని రహస్యంగా అందిన సమాచారం అందింది. ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్సై అనీల్‌, సిబ్బందితో కలిసి గురువారం రాత్రి దాడి నిర్వహించారు. దాడిలో 600 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.16 వేల వరకు ఉంటుంది. గంజాయిని స్వాధీనం చేసుకొని టిఫిన్‌ సెంటర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఎండీ మహ్మద్‌ను అరెస్టు చేయగా టిఫిన్‌ సెంటర్‌ యజమాని అయిన ప్రధాన నిందితుడు జతీలాల్‌ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

దొంగలకే దొంగలు

- అక్రమంగా పీడీఎస్‌ బియ్యం తరలిస్తుండగా..
- ఇద్దరిని కిడ్నాప్‌ చేసి.. 10 క్వింటాళ్లను మరో ముఠా చోరీ
- కిడ్నాపర్లను, వాహనాన్ని వదిలేసి పారిపోయిన వైనం
- నలుగురు అరెస్ట్‌, ఇద్దరు పరారీలో



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్తయ్య గౌడ్‌

జోగిపేట(అందోల్‌): అక్రమంగా పీడీఎస్‌ బియ్యాన్ని తరలిస్తున్న వారినే కిడ్నాప్‌ చేసి.. ఆ బియ్యాన్ని మరో వాహనంలో ఓ ముఠా ఎత్తుకెళ్లింది. కేసు దర్యాప్తులో నిందితులను జోగిపేట పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన వివరాలను సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య జోగిపేట సీఐ కార్యాలయంలో వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా చందానగర్‌ నుంచి ఈ నెల 16వ తేదీన నారాయణఖేడ్‌కు బొలేరో వాహనంలో అక్రమంగా 40 బస్తాల (10 క్వింటాళ్లు) బియ్యం పీడీఎస్‌ రైస్‌ను తరలిస్తున్నారు. ఈ విషయం వేరే దొంగల ముఠాకు తెలిసింది. దీంతో ఐదుగురు వ్యక్తులు షిఫ్ట్‌ కారులో చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లి టోల్‌ప్లాజా వద్ద బియ్యం కోసం మాటు వేసి ఉన్నారు. బోలారో వాహనం అక్కడి రాగానే వెంబడించి ఉదయం 4 గంటల సమయంలో అందోలు మండలం సంగుపేట వద్ద బొలేరో వాహనానికి వారి కారును అడ్డుపెట్టారు. వెంటనే బోలేరోలోని డ్రైవర్‌, మరో వ్యక్తిపై దాడి చేసి, కట్టేసి కారులో ఎక్కించుకున్నారు. ముఠాలోని ఇద్దరు వ్యక్తులు సోహైల్‌, ఆహ్మద్‌ బియ్యం ఉన్న బొలేరో వాహనాన్ని నడుపుకుంటూ మిగిలిన వారి కారును అనుసరిస్తూ హద్నూర్‌ వైపు వెళ్లారు. కొంత దూరం వెళ్లాకా ముఠా వ్యక్తులు అప్పటికే సిద్ధంగా ఉంచిన మరో అశోక్‌ లేలాండ్‌ ట్రాలీలో బియ్యాన్ని లోడ్‌ చేశారు. ముఠాలోని అఫ్రోజ్‌ అనే వ్యక్తి బియ్యం లోడ్‌ను జహీరాబాద్‌ వైపు తీసుకొని వెళ్లాడు. ముఠాలోని మిగిలిన వ్యక్తులు కిడ్నాప్‌ చేసిన ఇద్దరిని, వారి వాహనంతో అక్కడే వదిలేసి కారులో పారిపోయారు. ఈ విషయంపై బాధితులు ఇద్దరూ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు జహీరాబాద్‌ ప్రాంతంలో కారును గుర్తించి దాని ఆధారంగా హైదరాబాద్‌లో నలుగురు నిందితులు ఎండీ షఫీ ఖాన్‌, ఎండీ ఇలియాస్‌, సోహేల్‌, ఎండీ అఫ్రోజ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. మరో ఇద్దరు సోహెల్‌, ఆహ్మద్‌ పరారీలో ఉన్నారని తెలిపారు. వారి వద్ద నుంచి 40 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును త్వరగా ఛేదించిన జోగిపేట సీఐ అనీల్‌కుమార్‌, ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌ గౌడ్‌లతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.